

andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 32.7 కనిష్ఠం 20.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
శనివారం 10 ఫిబ్రవరి 2024





అటకెక్కిన జలవిహార్

2019లో బాసర నుంచి ఎస్‌ఆర్‌ఎస్‌పీ వరకు బోటు ట్రయల్‌రన్ పరిశీలించిన అధికారులు(ఫైల్)

బోట్ సౌకర్యం లేకపోవడంతో గోదావరి ఒడ్డున ఉన్న భక్తులు



- అమలు కాని ఎస్సారెస్పీ.. బాసర బోటు విహార ప్రాజెక్టు
- బాసరలో ఆగిపోయిన టూరిజం అభివృద్ధి
- భక్తులను నిరాశకు గురిచేస్తున్న పర్యాటకం
- నిర్లక్ష్యంలో నది తీర ప్రాంతాలు
- ఉపాధి కోల్పోతున్న స్థానికులు
- కొత్త సర్కారుపైనే జిల్లా ప్రజల ఆశలు

నిర్మల్, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ బాసర సరస్వతీ దేవిని సందర్శించుకునేందుకు వచ్చే యాత్రికులను ఆకట్టుకునేందు కోసం ఎస్సారెస్పీ - బాసర బోటు జలవిహారం ప్రాజెక్టు ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. కరోనా కల్లోలం తగ్గాక రాష్ట్రంలోని వివిధ నది తీర ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు నౌకావిహారం ప్రాజెక్టును అమలు చేయాలని ప్రభుత్వం తలపెట్టింది. ఇందులో భాగంగానే కొన్ని నదీ తీరప్రాంతాల్లో బోటు ప్రయాణాన్ని కొనసాగిస్తున్నప్పటికీ బాసర వద్ద మాత్రం ఇప్పటివరకు ఈ బోటు విహార సౌకర్యాన్ని యాత్రికులకు కల్పించలేకపోతున్నారు. బాసర సరస్వతీ దేవిని దర్శించేందుకు ప్రతీరోజు మన రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. ముఖ్యంగా ప్రతీ శుక్రవారంతో పాటు పండుగ పర్వదినాలలో అమ్మవారిని దర్శించేందు కోసం భక్తులు బారులు తీరుతారు. ఇక్కడ భక్తులకు వసతి సౌకర్యం ఉండడంతో ఒకరోజు గడిపి మరుసటి రోజు అమ్మవారి మొక్కులు తీర్చుకుంటారు. అమ్మవారి దర్శనం అనంతరం వీరంతా గోదావరిలో బోటు షికారు చేసే సౌకర్యం కల్పిస్తే ఇటు టూరిజం శాఖకు ఆదాయ పరంగా అలాగే భక్తులకు ఆహ్లాదకరంగా ఎంతో అనుకూలంగా ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదన..

బాసర నుంచి ఎస్సారెస్పీ ప్రాజెక్టు రిజర్వాయర్ వరకు బోట్లు నడపాలనే ప్రతిపాదన కాగితాలకే పరిమితమైంది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం శంకుస్థాపనకు అప్పట్లో పోచంపాడ్ వచ్చిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఈ అంశాన్ని ప్రస్తావించారు. పథకం పూర్తయితే కాళేశ్వరం జలాలతో ఎస్సారెస్పీ నిండాక బాసర - ఎస్సారెస్పీ మధ్య పడవలో ప్రయాణించవచ్చని ఆయన అప్పట్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సాగునీటి, పర్యాటక శాఖ అధికారులు ఇక్కడ బోటు విహారంపై దృష్టి సారించారు. ఇందులో భాగంగానే 2019లో కసరత్తు ప్రారంభించి ట్రయల్ రన్ కూడా ప్రయోగాత్మకంగా చేపట్టారు. సర్వీసులు కూడా ప్రారంభిస్తామని పర్యాటకశాఖ పేర్కొంది. కాని ఇప్పటి వరకు ఈ దిశగా దృష్టి సారించకపోవడం పట్ల యాత్రికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

భక్తులకు నిరాశే..

బాసర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం మరింత ఆహ్లాదం, మధురానుభూతిని పొందేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ఈ ప్రాజెక్టు సాకారమైతే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎస్సారెస్పీ చేరుకుని అక్కడి నుంచి బాసరకు బాసర నుంచి తిరిగి శ్రీరాంసాగర్‌కు పడవల ద్వారా ప్రయాణించే అవకాశం లభిస్తుంది. ఎస్సారెస్పీని ఆనుకుని ఉన్న నిజామాబాద్ జిల్లాలోని బస్వాపూర్, నాగాపూర్ గ్రామాల దగ్గర బోటింగ్ పాయింట్‌లు ఏర్పాటు చేసి బాసర వరకు పడవలను నడపాలని గతంలో అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. కానీ ఇప్పటివరకు సీరియస్ యాక్షన్ మొదలు కాలేదు.

అవకాశాలు అనేకం..

పర్యాటకశాఖ, దేవాదాయశాఖలు సంయుక్తంగా ప్రాజెక్టుపై సీరియస్ కార్యాచరణ మొదలుపెట్టాలని సూచిస్తున్నారు. గోదావరిలో బోటు ప్రయాణాలను ఆరంభిస్తే ఎస్సారెస్పీ నుంచి బాసర, బాసర నుండి ఎస్సారెస్పీ వరకు రెండున్నర గంటల వ్యవధిలో గమ్యం చేరు కోవచ్చంటున్నారు. సుమారు 60 కిలోమీటర్ల మేర ఈ ప్రయాణం సాగుతుందని మధ్యలో బ్రహ్మేశ్వరం ఆలయ సందర్శన, ఉమ్మెడ తదితర పర్యాటక ప్రాంతాల వద్ద బోట్లు నిలిపినా మూడు గంటల్లో బాసరకు చేరుకోవచ్చంటున్నారు. వేసవి మినహా మిగతా ఎనిమిది నెలల పాటు పడవలను నడిపే అవకాశముంటుందంటున్నారు.

కొత్త సర్కారు పైనే ఆశలు..


ఇదిలా ఉండగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎస్సారెస్పీ బాసర గోదావరి జల విహారం ప్రాజెక్టు ప్రతిపాదనలను కాగితాలకే పరిమితం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వ్యక్తం అయ్యాయి. అయితే కొత్తగా అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలకు మోక్షం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. యాత్రికులకు ఆహ్లాదం కల్పించేందుకోసమే కాకుండా టూరిజంశాఖకు ఆర్థికంగా కూడా ప్రయోజనం చేకూరుతుందన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కోణంతో నైనా జలవిహారం ప్రాజెక్టుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.



అపరిశుభ్రంగా కాలుష్యంతో గోదావరి తీరం

బాసరతో పీవీకి అనుబంధం

- ప్రధానమంత్రి హోదాలో1994లో అమ్మవారిని దర్శించుకున్న పాముల పర్తి వేంకట నర్సింహారావు
- పీవీ కుటుంబసభ్యులందరికీ బాసరలోనే అక్షర శ్రీకార పూజలు



బాసర ఆలయంలో ప్రధాని పీవీ నర్సింహారావు నాటిన మొక్క ఇదే

బాసర, ఫిబ్రవరి, 9 : దివంగత మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావుకు బాసర పుణ్యక్షేత్రంతో అనుబంధం ఉంది. బాసర సరస్వతి అమ్మవారి భక్తుడాయన. కేంద్ర ప్రభుత్వం పీవీ నర్సింహారావుకు ప్రతిష్టాత్మకమైన భారతరత్న ఇవ్వడంపై బాసర వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. మన రాష్ట్రానికి చెందిన పీవీ నర్సింహరావు బాసర సరస్వతీ అమ్మవారి భక్తుడు. తన పిల్లలకు బాసర సరస్వతి అమ్మవారి సన్నిధిలో అక్షర శ్రీకార పూజలు జరిపించినట్లు దేవస్థాన పండితులు చెబుతుంటారు. 1994లో ప్రధానమంత్రి హోదాలో బాసర సరస్వతీ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. అప్పుడు మన రాష్ట్ర ముఖ్యమంత్రి కోట్ల విజయ్‌భాస్కర్‌రెడ్డితో కలిసి అమ్మవారిని దర్శించుకున్నారు. మారుమూలన ఉన్న ఆలయాన్ని ప్రధానమంత్రి సందర్శించడం ఆ సమయంలో పెద్ద చర్చకు దారి తీసింది. ఆ సమయంలో అమ్మవారి ఆలయం గురించి బయట ప్రపంచానికి ఎక్కువ ప్రచారం నోచుకోలేదు. పీవీనర్సింహారావు లాంటి కొద్ది మంది తెలిసిన వారు ఆలయానికి వస్తుండేవారు. పీవీ నర్సింహారావు సందర్శన తర్వాతనే బాసర ఆలయం ఒక్కసారిగా బయట ప్రపంచానికి తెలిసింది. ఆ తర్వాత నుంచే భక్తుల సందర్శకుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతూ వచ్చింది. ఇప్పటికి పీవీ నర్సింహారావు కుటుంబ సభ్యులు అమ్మవారి ఆలయానికి వస్తుంటారు. పీవీ కుమార్తె బీఆర్ఎస్ ఎమ్మెల్సీ వాణిదేవి ఇప్పటికి అమ్మవారి దర్శనానికి బాసర వస్తుంటారు. పీవీ నర్సింహారావు మనువలు, మనువరాళ్లకు కూడా బాసరలోనే అక్షర శ్రీకారపూజలు జరిగాయి. 17 భాషలను మాట్లాడే బహుభాష కోవిదుడైన పీవీ నర్సింహారావు సరస్వతీ అమ్మవారి భక్తుడు కావడం స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికి మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహారావు నాటిన మొక్క ఇప్పటికి ఆలయ ప్రాంగణంలో వృక్షమై ఆయన గుర్తుగా మనకు దర్శనమిస్తుంది.

బాసర ఆలయ కార్మికుల ఆందోళన

- సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన
- అధికారుల హామీతో విరమణ



బాసర, ఫిబ్రవరి, 9 : దీర్ఘ కాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో పనిచేసే కార్మికులు ఆందోళన చేపట్టారు. విధులను బహిష్కరించి కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 22 ఏళ్లుగా పనిచేస్తున్న 83 మందిని రెగ్యులర్ చేయాలని కోరారు. సొసైటి పేరుతో వేతనాలు ఇస్తున్న అధికారులు ఆ విధానానికి స్వస్తి పలికి ఆలయ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జీవో 60 ప్రకారం వేతనాల పెంపు రోజుకు పనివేళలు 8 గంటలకు పరిమితం, స్కిల్డ్ వర్కర్స్‌గా గుర్తించాలని అన్నారు. ఆలయ ఈవో విజయరామారావు, స్థానిక రాజకీయ నాయకులు వచ్చి నచ్చజెప్పడంతో విరమించారు. వసంత పంచమి ఉత్సవాలుండడంతో భక్తులకు కలిగే అసౌకర్యాన్ని గుర్తించి విరమిస్తున్నట్లు కార్మికులు తెలిపారు.

ఐసీడీఎస్ కార్యాలయంలో విచారణ



విచారణ చేపడుతున్న ఆర్‌జేడీ ఎన్. మోతి

ముథోల్, ఫిబ్రవరి 9 : ముథోల్‌లోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో 2016-17 సంవత్సరంలో జరిగిన అక్రమాలపై ఆర్‌జేడీ ఎన్. మోతి శుక్రవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... 2016-17లో ముథోల్‌లో పని చేసిన సీడీపీవో సుగుణపై 200ల బియ్యం బ్యాగుల అవకతవకలపై విచారణకై వచ్చినట్లు వివరించారు. ఇది వరకు పలు పర్యాయాలు విచారణ జరిగినట్లు తెలిపారు. ఈ విచారణలో పూర్తిస్థాయి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందని, ఈ నివేదికను సంబంధిత కమిషనర్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో జగిత్యాల డీబ్ల్యూవో విజయ భాస్కర్, ముథోల్ సీడీపీవో శ్రీమతి, సిబ్బంది విజయ్ కుమార్, అర్జున్, తదితరులున్నారు.

నేరరహిత సమాజం కోసమే కార్డన్‌సెర్చ్

- ముథోల్ సీఐ మల్లేష్
- సరైన పత్రాలు లేని వాహనాలు స్వాధీనం



మాట్లాడుతున్న ముథోల్ సీఐ మల్లేష్

ముథోల్, ఫిబ్రవరి 9 : నేరరహిత సమాజం కోసమే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు ముథోల్ సీఐ మల్లేష్ అన్నారు. మండలంలోని చించాల గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున పోలీసుశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముథోల్ సీఐ మల్లేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది తనిఖీలు చేపట్టారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలి. సంబంధిత పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. గ్రామంలో గ్రామస్థులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, చిన్న పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఫోన్ ద్వారా ఎవరికి ఓటీపీలు చెప్పకూడదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామంలో అందరూ కలిసిమెలిసి ఉండాలని, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. కార్డన్‌సెర్చ్‌లో సరైన వాహనపత్రాలు లేని ద్విచక్ర వాహనాలు 111, ఫోర్ వీలర్స్ 4లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సాయికిరణ్‌తో పాటు సర్కిల్ పరిధిలోని ముగ్గురు ఎస్సైలు, 30 మంది పోలీస్ కానిస్టేబుల్స్ గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

'అధైర్య పడకండి ..అండదండగా నిలుస్తా'

భైంసా, ఫిబ్రవరి 9 : అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యామని అధైర్య పడవద్దని, అన్నింటికి తాను అండదండగా నిలుస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం భైంసాలోని పార్టీ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలన్నపుడు గెలుపు, ఓటములు సహజమని, ఓడినపుడు కృంగిపోకూడదన్నాడు. పరాజయానికి గల కారణాలు,లోపాలను సవరించుకొని ముందుకు సాగుదామన్నారు.సమస్యలపై నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉద్యమిద్దామన్నారు. బీఆర్ఎస్ అధిష్టానం పార్టీ బలోపేతానికి, శ్రేణుల సంక్షేమానికి బాధ్యతతో వ్యవహరిస్తుందని భరోసా కల్పించారు.

తనకు దక్కని అమ్మాయి
బతకకూడదనే ప్రణాళికతో హత్య




విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ మోహన్, టేబుల్‌పై హంతకుడు వాడిన కత్తి, వెనక ముసుగులో నిందితుడు

- ఐదేళ్లుగా ప్రేమిస్తున్నానని చెప్పిన పట్టించుకోలేదని పగ
- ప్రత్యేకంగా వేట కొడవలి తయారు చేయించి.. అదును చూసి దాడి చేసిన శ్రీకాంత్
- అలేఖ్య హత్య కేసులో వివరాలు వెల్లడించిన పోలీసులు
- నిందితుడి అరెస్టు, రిమాండ్
- హత్య చేసేందుకు ఉపయోగించిన కత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం

ఖానాపూర్, ఫిబ్రవరి 9 : తనకు దక్కని అమ్మాయి బ్రతకకూడదనే అత్యంత క్రూరమైన ఆలోచనతో ఓ ఉన్మాది పన్నిన పన్నాగంకు బలి అయింది షెట్పెల్లి అలేఖ్య. యువతి హత్యకేసులో నిందితుడు జూకింది శ్రీకాంత్‌ని శుక్రవారం ఖానాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే సీఐ డి. మోహన్ తెలిపిన కథనం ప్రకారం ఖానాపూర్ అంబేద్కర్‌నగర్‌కు చెందిన అలేఖ్య అనే 23 ఏళ్ల అమ్మాయిని అదే కాలనీకి చెందిన జూకింది శ్రీకాంత్ అనే యువకుడు గత ఐదేళ్లుగా ప్రేమిస్తున్నానని వెంట పడుతున్నాడు. అందుకు అమ్మాయి అలేఖ్య ఒప్పుకోకుండా అతడి ప్రతిపాదనను తిరస్కరించింది. కాగా తననే పెళ్లి చేసుకోవాలని వెంటపడి వేధించడం మాత్రం శ్రీకాంత్ ఆపలేదు. కాగా మూడు నెలల కిత్రం అలేఖ్యకు పెళ్లిసంబంధం కుదిరింది. దీంతో ఆ పెళ్లి సంబంధాన్ని శ్రీకాంత్ చెడగొట్టాడు. దీంతో పెద్దల ముందు పంచాయతీ పెట్టి శ్రీకాంత్‌ను మందలించారు. అయినప్పటికీ అతడి తీరు మార్చుకోకుండా పదేపదే అలేఖ్యను వెంట పడి వేధించడం కొనసాగించాడు. కాగా ఇటీవల కాలంలో అలేఖ్యకు పెళ్లి సంబంధాలు చూడడంతో ఎలాగైనా తనకు దక్కని అమ్మాయి అలేఖ్య ప్రాణాలతో ఉండకూడదని శ్రీకాంత్ పగను పెంచుకున్నాడు. ఆమెను చంపేందుకు ఎత్తుగడలు వేశాడు. ఆమెను చంపేందుకు పక్కా ప్రణాళిక రచించాడు. ఒక పదునైన వేటకొడవలి (కొబ్బరి బోండాలు నరికే కత్తి) తయారు చేయించుకొని అలేఖ్యను అంతంచేసేందుకు వేచిచూశాడు. కాగా తన వెనుక జరుగుతున్న ఈ పన్నాగం తెలియని అలేఖ్య గురువారం ఉదయం తన వదిన జయశీల అల్లుడు రియాన్స్‌తో కలిసి ఖానాపూర్‌లోని సన్‌స్కిల్స్ టైలరింగ్ సెంటర్‌లో శిక్షణ పొందేందుకు వెళ్లింది. ఆమె తిరిగి మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తుండగా ఆమె రాకపోకలను గమనిస్తున్న శ్రీకాంత్ ఖానాపూర్‌లోని శివాజీనగర్ ప్రాంతంలో జన సంచారం లేని సమయాన్ని చూసి ద్విచక్రవాహనంపై వెళ్లి వేట కొడవలితో (కొబ్బరిబోండాలు నరికే కత్తితో) అలేఖ్యపై తలపై, మెడపై, ఇతర చోట్ల విచక్షణారహితంగా నరికాడు. దీంతో అలేఖ్య అక్కడికక్కడే మృతి చెందింది. అలేఖ్యను శ్రీకాంత్ నరుకుతుండగా అడ్డుపడిన ఆమె వదిన జయశీలను సైతం విచక్షణారహితంగా నరకడంతో ఆమెకు, మూడేళ్ల బాలుడు రియాన్స్‌కు తీవ్ర గాయాలయ్యాయని సీఐ మోహన్ తెలిపారు. కాగా కేసు నమోదు చేసుకొని నిందితుడి కోసం గాలిస్తుండగా శుక్రవారం ఉదయం ఖానాపూర్ పట్టణ శివారులోని కొమురం భీమ్ చౌరస్తా వద్ద శ్రీకాంత్ పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. అతడిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నట్లు సీఐ మోహన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

అంతర్‌రాష్ట్ర గంజాయి ముఠా అరెస్టు


నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 9 : హైదరాబాద్ నుండి నిర్మల్‌కు అక్రమంగా మూడు వాహనాల్లో తరలిస్తున్న గంజాయిని గురువారం కొండాపూర్ జంక్షన్ వద్ద కాపుకాసి ఏడుగురు సభ్యుల ముఠాను నిర్మల్ రూరల్ పోలీసులు అరెస్టు చేశారని ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. శుక్రవారం డీఎస్పీ గంగారెడ్డితో కలిసి ఆమె విలేకరులకు వివరాలు వెల్లడించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మెగావత్ రాజు మెదక్ జిల్లా వటపల్లి గ్రామానికి చెందిన వాడు. కాగా షైక్ ఇమ్రాన్ నాసిక్ మహారాష్ట్ర, సాదిక్ షైక్ నాసిక్, మొహమ్మద్ ఇలియాస్ ఉట్నూర్ ఆదిలాబాద్, ప్రఫూర్ కుమార్ ఖిల్లా ఒడిస్సా, బాపులాల్ దేవ్ చాంద్ జారడే జాల్నా, పందేనా నిఖిల్ ఆదిలాబాద్‌గా గుర్తించారు. ఒడిస్సా రాష్ట్రం మల్కానిగిరి జిల్లాకు చెందిన ఓ వ్యక్తి వద్ద 50 కిలోల గంజాయి 3 వేలకు కిలో చొప్పున 1.50 లక్షలతో కొనుగోలు చేసి ముఠాగా ఏర్పడి వాహనాల్లో తరలిస్తారన్నారు. హైదరాబాద్, కామారెడ్డి, ఆర్మూర్, నిర్మల్, ఆదిలాబాద్ పరిసర ప్రాంతాల్లో అవసరమైన వారికి ఎక్కువ ధర కిలో 25 వేల చొప్పున అమ్ముకుని లాభపడతారన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

వారి నుండి 24.8 నిషేధిత గంజాయి విలువ 6 లక్షల 20 వేలు, నగదు 40 వేలు, 10 మొబైల్ ఫోన్లు, స్కోడా కార్లు రెండు, మహీంద్రా బొలెరో వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై చంద్రమోహన్‌ను ఎస్పీ అభినందించారు.

యూరియా వాడకం తగ్గించాలి.. చీడపీడలు నివారించాలి



కుంటాల, ఫిబ్రవరి, 9 : రైతులు వ్యవసాయ పంట భూముల్లో యూరియా వాడకాన్ని తగ్గించాలని జిల్లా వ్యవసాయాధికారి అంజి ప్రసాద్ అన్నారు. శుక్రవారం కల్లూర్ రైతు వేదికలో రైతులకు యూరియా వాడకంపై నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లో వరి, ఇతర పంటలకు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. యూరియా వాడకం వలన చీడపీడలు అధికంగా ఆశించే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు రైతులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

చించోలి(బి) ఘటనలో
ప్రిన్సిపాల్ సస్పెన్షన్

సారంగాపూర్, ఫిబ్రవరి 9 : మండలంలోని చించోలి (బి) వద్ద గల మైనారిటీ గురుకుల పాఠశాల ఘర్షణ ఘటనలో ప్రిన్సిపాల్ మహేష్‌పై వేటు పడింది. సంబంధిత అధికారులు ప్రిన్సిపాల్ మహేష్‌ను సస్పెండ్ చేశారు. గురువారం రాత్రి ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవలో అర్బాజ్ అనే విద్యార్థి మృతి చెందిన విషయం విధితమే. మృతుడి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళనల నేపథ్యంలో సంబంధిత అధికారులు పలు చర్యలు చేపట్టారు. నిందితుడిపై కేసు నమోదుతో పాటు మృతుడి కుటుంబంలో ఒకరికి ఔట్ సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చేందుకు అధికారులు హామీ ఇచ్చారు. అలాగే అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ. 25 వేలు అందించారు.

పాఠశాలను సందర్శించిన జడ్పీ సీఈవో

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 9 : జడ్పీ సీఈవో సుధీర్ శుక్రవారం జాఫ్రాపూర్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో పచ్చదనం, పరిశుభ్రత, మధ్యాహ్న భోజన అమలు పరిశీలించారు. విద్యార్థుల అభ్యసన కార్యక్రమాలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు తోడిశెట్టి పరమేశ్వర్, ఉపాధ్యాయులు పలు అంశాలు ఆయనకు తెలియజేశారు.

ముథోల్ భారత్ గ్యాస్ ఏజెన్సీలో చోరీ



భారత్ గ్యాస్ ఆఫీస్ వెనుక భాగం ఇనుప కిటికీని గ్యాస్‌కట్టర్‌తో కోసిన దొంగలు

ముథోల్, ఫిబ్రవరి 9 : ముథోల్ మండల కేంద్రంలోని భారత్ గ్యాస్ ఏజెన్సీలో గురువారం అర్ధరాత్రి చోరీ జరిగింది. భారత్ గ్యాస్ ఆఫీస్ వెనుక భాగంలోని ఇనుప కిటికీని గ్యాస్ కట్టర్‌తో తొలగించి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అందులో ఉన్న రూ. 15 వేల నగదు, సీసీ కెమెరాల డీవీఆర్‌ను దుండగులు దొంగిలించారు. సంఘటన స్థలాన్ని ముథోల్ సీఐ మల్లేష్, ఎస్సై సాయి కిరణ్‌లు పరిశీలించారు. గ్యాస్ ఏజెన్సీ మేనేజర్ ఉదయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

పెంబి, ఫిబ్రవరి 9 : మండలంలోని పోలీసుస్టేషన్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు 6 లక్షల నిధులతో మంజూరైన సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి నాయకులతో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షులు పుప్పాల నర్సయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా బాల్‌మంచ్ అధ్యక్షులు తులాల శంకర్, కాంగ్రెస్ నాయకులు భూమేష్, తోకల మహేందర్, గాండ్లశంకర్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

● ఎన్‌హెచ్ 61 ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్



రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 9 : రోడ్డు భద్రత నియమావళిపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని ఎన్‌హెచ్ 61 ప్రాజెక్టు మేనేజర్ శ్రీనివాస్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగ ఆఏర్పాటు చేసిన అవగాహన కార్య క్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా విద్యార్థులు మైనారిటీ తీరిన తర్వాతనే వాహనాలను నడపాలని, అలాగే హెల్మెట్ లేకుండా వాహనాలను నడపవద్దని సూచించారు. రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెసిడెంట్ ఇంజనీర్ బి.రమణమూర్తి, ఇంజనీర్ సీహెచ్. జానకిరామ్, ప్రధానోపాధ్యాయులు కే.నరేష్, అన్నపూర్, కన్‌స్ట్రక్షన్స్ ప్రతినిధులు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను మహిళలకు వివరించాలి

● శక్తివందన్ రాష్ట్ర కన్వీనర్ సుహాసినిరెడ్డి



మాట్లాడుతున్న సుహాసినిరెడ్డి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం చేపట్టిన అభివృద్ధి పథకాలు వారికి వివరించాలని శక్తివందన్ రాష్ట్ర కన్వీనర్ సుహాసినిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నారిశక్తి వందన్ అభియాన్ వర్క్‌షాప్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాబోయే ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి ఓటు వేసి నరేంద్రమోదీకి అండగా నిలవాలన్నారు. ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ద్వారా చేతివృత్తి చేసుకునే మహిళలను గుర్తించి పథకాలు అందేలా చూడాలన్నారు. జిల్లా కన్వీనర్ సామ రాజేశ్వర్‌రెడ్డి, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రావుల రాంనాథ్, అలివేలు మంగ, రజని వైద్య, తదితరులు పాల్గొన్నారు.


నాగోబా మహాపూజకు సమావేశమైన మెస్రం వంశీయులు


కొత్త కుండలను అందుకున్న మెస్రంవంశీయులు


కోనేరు జలాన్ని ఆలయానికి తెస్తున్న దృశ్యం


మహాపూజలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు


పుట్టకు ప్రత్యేక పూజలు చేస్తున్న మెస్రం వంశీయులు


మెస్రం వంశీయులు, మహిళలు పుట్ట మట్టితో తయారు చేసిన ఏడు వరుసలతో బహుళ దేవత


మహాపూజకు హాజరైన కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎంపీ గెడం నగేష్ తదితరులు

నాగోబా
మహాజాతర ప్రారంభం

- ప్రత్యేక పూజలు చేసిన మెస్రం వంశీయులు
- మహాపూజకు హాజరైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు
- ఆదివాసీల సంస్కృతికి అద్దం పట్టేలా సంప్రదాయ పూజలు
- 11న పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు పూజలు
- 12న నాగోబా దర్బార్
- 13న బేతాల్ పూజ, మండగాజలింగ్‌తో ముగింపు


హారతి ఇచ్చి జాతరను పారంభిస్తున్న మేస్త్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి9: ఆదివాసీల ఆరాధ్య దైవం, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన కేస్లాపూర్ నాగోబా జాతర శుక్రవారం అర్ధరాత్రి ప్రారంభమైంది. ప్రతీయేటా పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకుని ఆదివాసీలు అత్యంత వైభవంగా నిర్వహించే నాగోబా జాతర మెస్రంవంశీయుల మహాపూజలతో ప్రారంభించారు. ఆదివాసీ గిరిజనులు ముఖ్యంగా మెస్రంవంశీయులు తమ సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ నాగోబా సన్నిధిలో పవిత్ర గోదావరి జలాలతో నాగోబా దేవతనులాలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు, మెస్రం వంశీయులు పూజారి (కటోడ), మెస్రం కోసు ఆధ్వర్యంలో ఆచార వ్యవహారాలతో పూజలు నిర్వహించారు. శుక్రవారం మహాపూజతో ప్రారంభమైన నాగోబా జాతర వేడుకలు ఈనెల 15 వరకు కొనసాగనున్నాయి. శుక్రవారం అర్ధరాత్రి బేటింగ్ (కొత్త కోడళ్ల పరిచయం), 10 జాతర, భక్తుల దర్శనం, ప్రత్యేక పూజలు, 11న ఆదివాసీ దేవుళ్ల పెర్సాపేన్, బాన్‌పేన్‌లకు పూజలు చేయనున్నారు. 12న దర్బార్ నిర్వహించనున్నారు.

● హాజరు కానున్న మంత్రులు

నాగోబా మహాజాతరకు రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, హాజరుకానున్నారు. 13న బేతాల్ పూజ, మండగాజలింగ్ (ముగింపు కార్యక్రమం)తో జాతర ముగుస్తుంది. తెలుగు రాష్ట్రాలతోపాటు పక్కనే గత ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర నుంచి వేలాది మంది ఆదివాసీ గిరిజనులు తరలివచ్చారు. గుడారాలు వేసుకొని మర్రి చెట్టు నీడన బస చేశారు.

● సంప్రదాయ పద్ధతిలో పూజలు

పవిత్ర గంగాజలంతో మూడురోజులుగా మర్రిచెట్ల వద్ద బస చేసిన మెస్రం వంశీయులు శుక్రవారం ఉదయం ఆదివాసీ గిరిజన సంప్రదాయ వాయిద్యాలతో కేస్లాపూర్‌లోని పురాతన (మురాడి) నాగోబా విగ్రహంతోపాటు వెలిగించిన దీపాలను వెదురు బుట్టలో పట్టుకొని శోభాయాత్రగా ఆలయానికి బయల్దేరారు. వీరికి మర్రిచెట్ల వద్ద బసచేస్తున్న మెస్రం వంశీయులు స్వాగతంపలికారు. వీరందరూ కలిసి ఆలయానికి చేరుకొని మైసమ్మ దేవతకు పూజలుచేశారు. అనంతరం పురాతన నాగోబా విగ్రహతోపాటు నాగోబా దేవత, సతీ దేవత, బాన్‌దేవతలకు సంప్రదాయ పూజలుచేసి పురాతన విగ్రహాన్ని గర్భగుడిలోని నాగోబా విగ్రహం వద్ద ఉంచారు. ఆలయం వెనుకున్న బాన్ దేవతలతోపాటు పెర్సాపేన్‌కు పూజలుచేసి మళ్లీ ఆలయంలోకి ప్రవేశించారు. అనంతరం మహాపూజకు ఉపయోగించే ఆలయం వెనుక ఉన్నమట్టి కుండలను మెస్రం వంశీయులు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్‌రావు ఆధ్వర్యంలో మెస్రం వంశీయుల కటోడ మెస్రం కోసు, కటోడ మెస్రం కోసేరావు, కటోడ హనుమంతరావు పూజలు చేశారు. మెస్రం వంశీయుల పెద్దలు 22కితల వారీగా కొత్త కుండలను ఇవ్వగా మహిళలు పెద్దలు ఆశీర్వాదం తీసుకుని అందుకున్నారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు, ఆడపడుచులు వరుసగా వెళ్లి పడమర, మర్రిచెట్టు సమీపంలోని కోనేరు వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోనేరు నీటిని తోటి మట్టికుండల్లో నింపి మహిళలు తలపై పెట్టుకుని ఆలయానికి తీసుకొచ్చారు. ఆడపడుచులు తెచ్చిన నీటితో మట్టిని కలిపి పుట్టలను తయారు చేశారు. తయారు చేసిన పుట్టల నుంచి మట్టిని ఉండల రూపంలో తీసుకుని ఏడు వరుసలతో బౌల దేవతను తయారు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏడువరుసలతో తయారుచేసిన మట్టి ఉండలతో నాగోబా ఆలయం పక్కనే ఉన్న ఆలయంలో సతిదేవతల బౌలను తయారుచేసి సంప్రదాయ పూజలు చేశారు. ఈ పూజల్లో మెస్రం వంశీయులకు నాగోబా చరిత్రను కిక్రి వాయిస్తూ పాటల ద్వారా వివరించారు.

● తరలివచ్చిన మెస్రం వంశీయులు

వివిధ ప్రాంతాల నుంచి మెస్రం వంశీయులు, కొత్త కోడళ్లు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చినఆదివాసీ పరస్పరం ఆత్మీయ పలకరింపులతో తన్మయత్వంతో మైమరిచిపోయారు. ఎడ్లబండ్లపై కుటుంబ సమేతంగా వచ్చిన మెస్రం వంశీయులు ప్రత్యేక గుడారాలు ఏర్పాటు చేసుకున్నారు. మహిళలు 22 ప్రత్యేక పొయ్యిలను ఏర్పాటు చేసుకుని మహాపూజకు అవసరమైన నైవేద్యాన్ని తయారు చేశారు. మహాపూజకు అరగంట ముందు నాగోబా ఆలయాన్ని గంగాజలంతో శుద్ధిచేశారు. రాత్రి 10గంటల తర్వాత మెస్రంవంశీయులు గోవ్వాడ్ నుంచి వెలిగించిన కాగడాలను చేతిలో పట్టుకుని వాయిద్యాలు వాయిస్తూ ఆలయానికి చేరుకున్నారు. నాగోబా ఆలయంలో మహాపూజలు నిర్వహించేటప్పుడు ఇతరులను లోనికి రానివ్వకుండా పకడ్బందీగా చర్యలు తీసుకున్నారు. 10 నుంచి రాత్రి 12గంటల వరకు మెస్రం వంశీయులే నాగోబాకు మహాపూజలు నిర్వహించారు. మెస్రం వంశీయుల మహాపూజల అనంతరం ఇతరులకు పూజలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఈ పూజాకార్యక్రమాల్లో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, భక్తులు, మెస్రం వంశీయులతో కలిసి నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున 3గంటల వరకు బేటింగ్ (పరిచయం) పూజలకు ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం తుకారం, మెస్రం చిన్ను పటేల్, బాదిరావు పటేల్, లింబారావు పటేల్, జంగుపటేల్, కటోడ మెస్రం కోసేరావు, పర్ధాంజీ, మెస్రం దాదారావు, కొత్వాల్ మెస్రం తిరుపతి, హనుమంతరావు, కోశరావు, మెస్రం వంశీయులు మనోహర్, దేవ్‌రావు, సోనేరావు, నాగ్‌నాథ్, శేఖర్‌బాబు, ఆనంద్‌బాబు, ఆలయ పూజారి మెస్రం షేకు తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఓట్‌సోర్సింగ్ ఉద్యోగులు

రెండోరోజూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

ఉట్నూర్, ఫిబ్రవరి9: మండలకేంద్రంలోని జిల్లాకేంద్ర ఆసుపత్రిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులు రెండోరోజు నిరసన తెలిపారు. శుక్రవారం తెలంగాణ మెడికల్‌అండ్‌హెల్త్ ఔట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి బొంకంటి సుభాష్ ఆధ్వర్యంలో 3నెలల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఏజెన్సీ విధానం రద్దు చేసి నేరుగా ప్రభుత్వమే నేరుగా లేదా కార్పొరేషన్‌ద్వారా జీతాలు ఇచ్చి తమ కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యోగులు మహేశ్‌రెడ్డి, భానుప్రసాద్, వెంకటేశ్, ప్రతాప్, గంగాదర్, వీణ, సూర్య, రోషిని, లేతుబాయి, జ్యోత్న్న ఆసుపత్రి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ పాల్గొన్నారు.

విద్యార్థులు పోషకాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న కాంప్లెక్స్ హెచ్‌ఎం

జైనథ్, ఫిబ్రవరి9: విద్యార్థులు పోషక ఆహారం తీసుకోవాలని, వాటి యొక్క విలువలను తెలుసుకోవాలని మేడిగూడ కాంప్లెక్స్ హెచ్‌ఎం పి. లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మాంగూర్ల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించి ఫుడ్‌ఫెస్టివల్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు స్వయంగా చేసిన భోజనాలను పరిశీలించి వారి ప్రతిభకు రూ.2వేల విరాళాన్ని పాఠశాలకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి.రవీందర్‌గౌడ్, ఉపాధ్యాయులు జె.చంద్రకళ, అరుణ్, టి.వినోద్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, గ్రామపెద్దలు సంతోష్, ప్రతాప్, రషీద్, స్వామి పాల్గొన్నారు.

సంక్షేమ ఫలాలను ప్రతీఒక్కరు పొందాలి

జైనథ్, ఫిబ్రవరి9: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాలను ప్రతీఒక్కరు పొందాలని బీజేపీ జైనథ్ మండల అధ్యక్షుడు కట్కం రాందాస్ అన్నారు. గావ్‌చలో బస్తీ చలో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని కూర, ఆనంద్‌పూర్, దీపాయిగూడ, కరంజి గ్రామాల్లో గల ప్రభుత్వపాఠశాలలను, అంగన్‌వాడీ కేంద్రాలను, ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా వస్తున్నా నిధులను అంగన్‌వాడీ కార్యకర్తలు హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చ జైనథ్ మండల అధ్యక్షులు ఏనుగు రాకేష్‌రెడ్డి, దీపాయిగూడ, ఎంపీటీసీ లోక కరుణాకర్‌రెడ్డి, నాయకులు సిడాం రాకేష్, రమేష్‌లతోపాటు ఆయా గ్రామాల బీజేపీ నాయకులు కార్యకర్తలు అంగన్‌వాడీ కార్యకర్తలు హెచ్‌ఎంలు, ఏఎన్‌ఎంలు ఉన్నారు.

పంటల నమోదును పకడ్బందీగా చేపట్టాలి: ఏవో

జైనథ్, ఫిబ్రవరి9: రైతులు వేసిన పంటల నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ఎ.వివేక్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో గల శనగ పంటను పరిశీలించి రైతులకు తగు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు యాసంగి కాలంలో వేసిన శనగ, జొన్న, పల్లి తదితర పంటల నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో మేడిగూడ వ్యవసాయ విస్తరణాధికారి ఆనంద్‌లతో పాటు పార్డి(బి) శనగ రైతులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో ఘనంగా సాయినాథుడి పల్లకీసేవ


సాయినాథుడి పల్లకితో ఖానాపూర్ వీధుల్లో శోభాయాత్ర


పట్టణంలో ప్రధాన వీధుల గుండా ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం


ఆలయం వద్ద నుంచి శోభాయాత్ర ప్రారంభిస్తున్న దృశ్యం

ఖానాపూర్, ఫిబ్రవరి 9 : మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ శివ సాయి సమాజ్ ఆలయ 27వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో సాయినాథుడి పల్లకీ ఊరేగింపును అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సాయిబాబా ఆలయం నుండి ఉత్తర వాహిని గోదావరి నది తీరం వరకు ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఊరేగించి గోదావరిలో విగ్రహాలకు నదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం ఓం శ్రీ సాయి జయ సాయి జయ జయ సాయి అనే మంత్రాన్ని జపిస్తూ తిరిగి స్వామి విగ్రహాలను ఆలయానికి తీసుకువచ్చారు. ఈ శోభాయాత్ర సందర్భంగా సాయిబాబా భక్తులు చేసిన సాయి నామస్మరణతో ఖానాపూర్ పట్టణ పురవీధులన్నీ మార్మోగాయి. సాయి నాథుడిని పోలిన రూపంలో సాయిభక్తుడు ఒకరు భక్తులను ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో ఆలయ కమిటీ అధ్యక్షులు రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొక్కుల ప్రదీప్, ఆలయ కమిటీ కోశాధికారి శేఖరయ్య, మాజీ అధ్యక్షులు కిషోర్, నిర్వాహకులు మడిగెల గంగాధర్, ద్యావతి రాజేశ్వర్, తూము చరణ్, తదితరులు ఉన్నారు.



మహిళా ఓటర్లే కీలకం

- నిర్మల్ జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికం

భైంసా,ఫిబ్రవరి 9 :రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లాలో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. జిల్లా పరిధిలోని మూడు అసెంబ్లీ నియోజక వర్గాల పరిధిలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. తాజాగా విడుదలైన ఓటరు జాబితా ప్రకారం జిల్లాలోని నిర్మల్, ఖానాపూర్, ముథోల్ నియోజక వర్గాల పరిధిలో మొత్తం 7,34,665 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,53,786 మంది, మహిళలు 3,79,880మంది, ఇతరులు 51 మంది, ఎన్‌ఆర్‌ఐలు 21 మంది, సర్వీసు ఓటర్లు 927 మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు 26,097 మంది అధికంగా ఉన్నారు. ఇక నియోజక వర్గాల వారీగా పరిశీలిస్తే ముథోల్ నియోజకవర్గ పరిధిలో 2,53,877 మంది ఓటర్లు ఉండగా ఇక్కడ మహిళా ఓటర్లు 1,30,378 మంది, పురుషులు 1,23,208 మంది, ఇతరులు 18 మంది, ఎన్‌ఆర్‌ఐలు 2 , సర్వీసు ఓటర్లు 271 ఉన్నారు. నిర్మల్ నియోజక వర్గ పరిధిలో మొత్తం 2,56, 398 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళాఓటర్లు 1,35,057 మంది ఉండగా పురుషులు 1,21,070 మంది, ఇతరులు 20 మంది, ఎన్‌ఆర్‌ఐలు 9 మంది, సర్వీసు ఓటర్లు 242 మంది ఉన్నారు. ఖానాపూర్ నియోజక వర్గ పరిధిలో మొత్తం 2,24,390 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 1,14,448 మంది, పురుషులు 1,09,508 మంది, ఇతరులు 13 మంది, ఎన్‌ఆర్‌ఐలు 10 మంది, సర్వీసు ఓటర్లు 414మంది ఉన్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లు నిర్మల్ నియోజకవర్గ పరిధిలో 13,987 మంది, ముథోల్ నియోజకవర్గ పరిధిలో 7,170 మంది, ఖానాపూర్ నియోజకవర్గ పరిధిలో 4,940 మంది ఎక్కువగా ఉన్నారు.

ఉపాధ్యాయుల
సంక్షేమం కోసం పీఆర్టీయూ కృషి

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 9 : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల సంక్షేమం కోసం ఎల్లప్పుడు కృషి చేస్తున్నది పీఆర్టీయూ అని జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు అన్నారు. నిర్మల్‌లో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సంఘ పతాకాన్ని ఆవిష్కరించి ఆయన మాట్లాడుతూ... 1971 సంవత్సరంలో ఏర్పాటైన పీఆర్టీయూలో ప్రస్తుతం 75 వేల మంది సభ్యత్వంతో ముందుందన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యా యుల బదిలీలు, పదోన్నతులతో పాటు సీపీఎస్ రద్దు, తదితర సమస్యలపై పోరాటం చేస్తామన్నారు. నాయకులు రమేష్‌రెడ్డి, బి. శ్రీను, మోహన్, సిద్ధారాం, అశోక్, సంజీవ్‌రావు, కెపీ రెడ్డి, హరిప్రసాద్, లింగన్న, దేవిప్రియ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడ్జెట్‌లో విద్యారంగానికి అధికనిధులు కేటాయించాలి

భైంసా : ప్రణాళికబద్ధమైన విధానాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం రానున్న బడ్జెట్‌లో విద్యా రంగానికి అధికంగా నిధులు కేటాయించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.వీ రమణరావ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పీఆర్టీయూ భవనంలో యూనియన్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు.పాఠశాలల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం, మౌళిక వసతుల కల్పన, తరగతి గదులు, ఉపాధ్యాయుల కొరతను తీర్చేందుకు గాను బాధ్యతాయుతమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూ సంఘంతోనే సాధ్యమవుతుందన్నారు.పంచాయతీరాజ్ ఉపాధ్యాయుల సంక్షేమమే ప్రధాన ఎజెండాగా 1973 లో సంఘం అవిర్భవించిందని గుర్తు చేశారు. ఆవిర్భావ దినోత్సవాన్ని పురష్కరించుకొని యూనియన్ జెండాను ఎగురేసి, సంఘం కోసం పనిచేసిన విశ్రాంత కార్యకర్తలకు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఇందులో భైంసా డివిజన్ పరిధిలోని ఆయా మండలాల యూనియన్ కార్యవర్గ ప్రతినిధులు, ప్రధాన సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 9 : రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనేందుకు నిర్మల్ జ్యోతిబాపూలే పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పి. శివ, రేవంత్, కృతిక్, సాయి దీక్షిత్, ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు.

కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన

తాంసి, ఫిబ్రవరి9: మండలంలోని గోట్కూరి గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలలో కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగహన కల్పించారు. ఆ వ్యాధి ఎలా వస్తుంది.. దీన్ని నిర్మూలించేందుకు కోసం తీసుకోవాల్సి చర్యల గురించి విద్యార్థులకు వివరించారు. ఆరోగ్య సమస్యలు, వ్యాధులు సోకినట్లయితే వెంటనే ప్రభుత్వ ఆసుప్రతికి వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యులు సూచనలు పాటించాలని పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెల్త్‌సూపర్‌వైజర్ తులసీరామ్, పలు ఉపాధ్యాయులు, ఆశావర్కర్లు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

గృహజ్యోతి

ప్రతి కుటుంబానికి

200 యూనిట్ల

ఉచిత విద్యుత్



- జిల్లాలో 85 శాతం కుటుంబాలకు ప్రయోజనం
- తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్
- ఈనెల 15 వరకు అర్హులైన లబ్ధిదారుల జాబితా గుర్తింపు
- ఇంటింటా కొనసాగుతున్న అధికారుల సర్వే

గృహలక్ష్మి అమలుకు కసరత్తు!




వివరాలు నమోదు చేసుకుంటున్న విద్యుత్ సిబ్బంది


వివరాలు సేకరిస్తున్న విద్యుత్ అధికారులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి9 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇప్పటికే మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతోపాటు రాజీవ్ ఆరోగ్య శ్రీ పథక పరిమితిని రూ.10 లక్షలకు పెంచి ప్రభుత్వం వైద్య సేవలు అందిస్తోంది. ఇచ్చిన మాట ప్రకారం వంద రోజుల్లో ఆరు గ్యారెంటీ స్కీములను అమలు చేసే దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తోంది. ఇప్పటికే డిసెంబరు 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కింద ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన సీఎం రేవంత్‌రెడ్డి ఇంద్రవెల్లి బహిరంగ సభలోనే రెండు గ్యారెంటీ స్కీములను అమలు చేసేందుకు ప్రకటన చేశారు. ఇందులో రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగదారులకు ఉచిత కరెంట్‌ను సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాలతో విద్యుత్ శాఖాధికారులు జిల్లావ్యాప్తంగా ప్రత్యేక సర్వేను చేపట్టి వివరాలను సేకరిస్తున్నారు. ఇందులో విద్యుత్ వినియోగదారుల ఆధార్‌కార్డు, సర్వీసునెంబర్, రేషన్‌కార్డు, ఫోన్ నెంబర్ వివరాలను సేకరిస్తున్నారు. త్వరలోనే జిల్లాలో అర్హులైన లబ్ధిదారుల జాబితాను వెల్లడించే అవకాశం కన్పిస్తోంది.

• లక్షా 60వేల సర్వీసులు

జిల్లాలో మొత్తం లక్షా 60వేల గృహ వినియోగ సర్వీసులు ఉన్నట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తోంది. ఇందులో సుమారుగా లక్షా 40 వేల గృహ వినియోగ సర్వీసులు గృహజ్యోతి పథకానికి అర్హులయ్యే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. దాదాపుగా 85 శాతం కుటుంబాలకు లబ్ధి చేకూరే అవకాశం ఉందంటున్నారు. ఇప్పటికే వంద యూనిట్లలోపు విద్యుత్ వినియోగం కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నారు. అదనంగా మరో వంద యూనిట్లను ఉచితంగా సరఫరా చేసేందుకు ప్రభుత్వం హామీ ఇవ్వడంతో ఈ కుటుంబాలు కూడా గృహజ్యోతి పథకం అమలులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. అయితే ఒక్కో కుటుంబం నాలుగైదు సర్వీసులను కలిగి ఉండడంతో లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయే అవకాశం కనిపిస్తుంది.

• తెల్ల రేషన్‌కార్డుతో లింకు

ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు గృహజ్యోతి పథకాన్ని అమలు చేసేందుకు సన్నద్ధమవుతున్న తెల్లరేషన్‌కార్డుతో లింకు పెట్టడంతో కొన్ని కుటుంబాలు ఈ పథకానికి దూరమయ్యే ప్రమాదం కనిపిస్తుంది. ఎందుకంటే 200 యూనిట్లలోపే విద్యుత్ వినియోగమవుతున్న కొంతమంది తెల్లరేషన్‌కార్డును కలిగి లేకపోవడంతో పథకానికి దూరమయ్యే అవకాశం ఉంది. జిల్లాలో లక్షా 60వేల గృహవినియోగ సర్వీసులు ఉండగా లక్షా 40వేల సర్వీసులు 200 యూనిట్లలోపే వినియోగమవుతున్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. అలాగే ఈపథకాన్ని అందించేందుకు బిల్లింగ్‌మిషన్‌లో అదనంగా మరిన్ని వివరాలను నమోదుచేస్తున్నారు. వినియోగదారుని ఫోన్ నెంబర్, ఆధార్ కార్డు, సర్వీసు నెంబర్, ప్రజాపాలన నమోదు నెంబర్‌ను పరిశీలిస్తున్నారు. ఈ నెల 15వరకు ఇంటింటి సర్వేను పూర్తిచేసి అర్హులైన లబ్ధిదారుల జాబితాపై స్పష్టత ఇచ్చే అవకాశం కనిపిస్తుంది. ఇప్పటికే క్షేత్రస్థాయిలో బిల్లింగ్ సిబ్బంది, లైన్‌మెన్, జూనియర్ లైన్‌మెన్ తదితరులు సర్వేలో పాల్గొని వివరాలను సేకరిస్తున్నారు.

సర్వే కొనసాగుతోంది

• జీఆర్ చౌహాన్ (ఇన్‌చార్జి ఎస్‌ఈ, ఆదిలాబాద్)

ప్రభుత్వ ఆదేశాలతో గృహజ్యోతి పథకాన్ని అమలు చేసేందుకు సర్వేను చేస్తున్నాం. ఈనెల 15వరకు సర్వేను పూర్తిచేసి వివరాలను వెల్లడిస్తాం. 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్న సర్వీసు వివరాలతోపాటు అదనంగా ఆధార్‌కార్డు, వినియోగదారుని ఫోన్‌నెంబర్ వివరాలను సిబ్బంది సేకరిస్తున్నారు. అలాగే అద్దెకు నివాసం ఉంటున్న వారి సర్వీసు, వినియోగం వివరాలను సేకరిస్తున్నాం.

• తలమడుగులో సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్


ప్రతీఒక్కరు రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

• మోటార్ వెహికల్ ఎన్‌స్పెక్టర్ ప్రదీప్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న ప్రదీప్‌కుమార్ గౌడ్

బజార్‌హత్నూర్, ఫిబ్రవరి 9: వాహనదారులు ప్రతీఒక్కరు రోడ్డుభద్రతా నియమాలు పాటించాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని జిల్లా పరిశత్ సెకండరీ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డుభద్రతా నియమాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలోనే రోడ్డు నియమాల గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వాహనదారులు ప్రయాణించినప్పుడు అనేక రకాలైన సూచికలను మనం గమనించవచ్చని, వాటిని గమనిస్తూ పాటించాలని అన్నారు. ఈ రోడ్డు నియమాలను పాటించడంతో గమ్య స్థానాన్ని సురక్షితంగా చేరుకుంటారని తెలిపారు. విద్యార్థులందరూ తమ తల్లితండ్రులకు రోడ్డు భద్రతా నియమాల గురించి విధిగా తెలియజేయాలని విద్యార్థులకు సూచించారు. ద్విచక్ర వాహణాలపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని, ఇతర వాహనాలలో ప్రయాణించే వారు సీట్‌బెల్టు ధరించడం వలన కలిగే ప్రయోజనాల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేష్, డాక్టర్ భీంరావు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన ఎంపీ సోయం


అమిత్‌షాతో సమావేశమైన ఎంపీ సోయంబాపురావు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 9: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యుడు సోయం బాపురావు మర్యాద పూర్వకంగా శుక్రవారం ఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా జిల్లాకు సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో బీజేపీ పార్టీ పరిస్థితులు, రాబోయే పార్లమెంట్ ఎన్నికల గురించి ఆరా తీసినట్లు తెలిసింది. మళ్లీ సిట్టింగ్ ఎంపీ సోయం బాపురావుకే టికెట్‌పై అధిష్ఠానం స్పష్టమైన హామీ ఇచ్చినట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ భారీ మెజార్టీతో గెలుస్తుందని ఎంపీ సోయం బాపురావ్ ధీమా వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

ఉట్నూర్ మండలానికి రూ.3.90 కోట్ల మంజూరు

ఉట్నూర్, ఫిబ్రవరి 9: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉట్నూర్ మండలానికి రూ.3.90 మంజూరయ్యాయని ఉట్నూర్ మండల పరిషత్ అధ్యక్షుడు పంద్ర జైవంత్‌రావు తెలిపారు. బీర్సాపేట్, చందూరి, నాగపూర్, ఉమ్రి, చింతకర్ర, జమాల్‌తండా, కన్నపూర్, మారుగూడ, నడ్డంగూడ, నర్సాపూర్(జె), సాకెరబి, తంద్రా, సాంపూర్ ఒక్కో జీపీకి రూ.10లక్షల చొప్పున, ఉట్నూర్, ఘన్‌పూర్ పంచాయతీలకు రూ.50లక్షల వంతున లక్కారం గోండుజి హీరాపూర్ జె, శ్యాంనాయక్, తండా గ్రామ పంచాయతీలకు రూ.20 లక్షల వంతున నర్సాపూర్ (బీ)కి రూ.30లక్షలు, సాలెవాడ (బి), చెరువుగూడెం, పంచాయతీలకు రూ.15లక్షల వంతున నిధులు మంజూరయ్యాయని తెలిపారు.

కార్యకర్తలకు మాజీ మంత్రి పరామర్శ

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి9: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు బీఆర్ఎస్ కార్యకర్తలను మాజీ మంత్రి జోగురామన్న శుక్రవారం పరామర్శించారు. ప్రమాదవశాత్తు గాయపడ్డ టీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు వాఘ్మారే ప్రశాంత్‌ను వారి నివాసానికి వెళ్లి పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. అలాగే జాగృతి ప్రధాన కార్యదర్శి గోలిశంకర్ అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఆసుపత్రికి వెళ్లి మాజీ మంత్రి పరామర్శించి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట బండారి సతీష్, రంగినేని శ్రీనివాస్, సాజిదొద్దిన్, రమేష్, తదితరులున్నారు.

గిరిజన వైద్య ఆరోగ్య సేవలను అందుబాటులోకి తేవాలి

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి9: ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో గిరిజన వైద్య ఆరోగ్య సేవ సహాయ కేంద్రాన్ని వెంటనే అందుబాటులోకి తేవాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్కబాపురావు అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ రిమ్స్ ఆసుపత్రిలో సహాయ కేంద్రం లేక ఏజెన్సీ ప్రాంత మారుమూల గ్రామాల నుంచి వచ్చే ఆదివాసీ గిరిజన రోగులకు వార్డులు తెలియక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సిబ్బంది లేకపోవడంతో మూతబడిన ఆరోగ్య సేవ కేంద్రాన్ని వెంటనే తెరిపించాలని కోరారు.

జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కేజీబీవీ విద్యార్థినుల ఎంపిక

నేరడిగొండ, ఫిబ్రవరి9: 9వ తెలంగాణ జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ బాలికల రాష్ట్రస్థాయి పోటీలు ఈనెల 3 నుంచి ఈ నెల4 వరకు తుప్రాన్, మెదక్‌జిల్లాల్లో నిర్వహించగా ఇందులో ప్రతిభ కనబర్చిన కేజీబీవీ విద్యార్థినులు జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు ఆదిలాబాద్ జిల్లా తరుపున పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచారు. పోటీల్లో ప్రతిభ కనబర్చిన నేరడిగొండకు చెందిన విద్యార్థినులు బి.వనిత, డి.శిరీషా, ఎం.అలేఖ్య జాతీయస్థాయికి ఎంపికైనట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ సెక్రెటరీ గంగాధర్ తెలిపారు. బిహార్‌లోని పాట్నాలో జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు.

పారితోషకాలు చెల్లించాలని కలెక్టరేట్ ఎదుట ధర్నా

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు


ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి9: రెండు నెలలుగా పారితోషకాలు ఇవ్వడం లేదని, వెంటనే తమకు రావాల్సిన పారితోషకాలు ఇచ్చి ఆదుకోవాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల ఎదుట ఆందోళన చేపట్టారు. ఆశావర్కర్లకు గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న మాట్లాడుతూ రాష్ట్రంలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు డిసెంబర్, జనవరి రెండు నెలల పారితోషకాలు రాలేదని, గతంలో ప్రతీనెల 2న పారితోషకాలు వచ్చేవని, రెండు నెలలు దాటినా పారితోషకాలు రావడం లేదని అన్నారు. నెలల తరబడి రాకపోవడంతో ఆశావర్కర్లు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని, అప్పు చేసి బతకాల్సిన దుర్భర పరిస్థితులు నెలకొన్నాయని అన్నారు. 18 ఏళ్ల నుంచి ఆశావర్కర్లు పనిచేస్తున్నారని, వీరంతా మహిళలు, బడుగు బలహీనవర్గానికి చెందినవారని అన్నారు. నేటికి కనీస వేతనం లేదని, కనీసం ఫిక్స్‌డ్ వేతనం కూడా ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. చాలీచాలని పారితోషకాలతో బతుకుతున్నారని, ఇవి కూడా సకాలంలో రాక పోవడంతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అలాగే పారితోషకం లేని అభయహస్తం, మహాలక్ష్మి తదితర అదనపు పనులను ఆశాలతో చేయించవద్దని, సమ్మె సందర్భంగా అక్టోబర్ 9న అధికారులు ఇచ్చినహామీని అమలు చేయాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పారితోషకాన్ని రూ.18వేలకు పెంచి ఫిక్స్‌డు వేతనం ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్‌చేశారు. ఇందులో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు అగ్గిమల్ల స్వామి,ఆశా యూనియన్ జిల్లాఅధ్యక్ష కార్యదర్శులు ఉన్నారు.

గ్రంథాలయాలు.. విజ్ఞాన నిలయాలు

• మహాలక్ష్మి, గృహలక్ష్మి పథకాల లబ్ధిదారులు సర్వే అధికారులకు సహకరించాలి • జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్


రుయ్యాడిలో మురికి కాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్

తలమడుగు, ఫిబ్రవరి9: గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎస్ అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలోని గ్రామ పంచాయతీ భవన సముదాయంలో నూతనంగా ఏర్పాటు చేసిన వివేకానంద గ్రంథాలయాన్ని కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రంథాలయాలు విద్యార్థుల భవిష్యత్తుకు విజ్ఞానికి నిలయానికి అన్నారు. గ్రామస్థుల సహకారంతో యువత గ్రంథాలయం ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని అన్నారు. యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని రానున్న పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని సూచించారు. గ్రామస్థులందరూ ఐక్యమత్యంతో ఉండి గ్రామాభివృద్ధికి పాటుపడాలన్నారు. జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గ్రంథాలయం ప్రారంభించుకోవడం సంతోషకరమని, యువత ఉన్నతంగా ఎదిగేందుకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. గతేడాది 50 లక్షల భయంతో వివిధ కుల సంఘాల భవనాలు నిర్మించనున్నారు. అంతేకాకుండా తెలుగుదేశం పార్టీ హయాంలో పక్క గృహాలు ఎస్సీ ఎస్టీలకు రుణాలు ఆదర్శ గ్రామ పంచాయతీ అవార్డులు తీసుకోవడం జరిగిందన్నారు. ఇటి వలే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని గ్రామాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకుకృషి చేస్తానన్నారు.

• సర్వే అధికారులకు సహకరించాలి

మహాలక్ష్మి, గృహజ్యోతి పథకం లబ్ధిదారుల వివరాల పరిశీలన ప్రక్రియను పరిశీలించి ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్న వివరాలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు చేశారు. ప్రజలు సరైన వివరాలు అందించి సర్వేబృందాలకు సహకరించాలని కోరారు. సర్వే అధికారులకు సంబంధించిన లబ్ధిదారులు రేషన్‌కార్డు ఆధార్‌కార్డు, గ్యాస్ ఏజెన్సీ బుక్ నెంబర్, విద్యుత్ మీటర్ నెంబర్, ఇతర పత్రాలు అధికారులకు అందించాలని కోరారు.

• స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో ప్రత్యేక శ్రద్ధ వహించాలి

స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా గ్రామంలో పర్యటించి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నర్సరీ, సెగ్రిగేషన్‌షెడ్, పల్లె ప్రకృతి వనాలను పరిశీలించారు. ప్రత్యేక అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పర్యవేక్షణ చేపట్టాలని, గ్రామంలో నిరంతరం పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, తడిపొడి చెత్తను వేరు వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్‌కు తరలించాలన్నారు. ప్రజలందరూ తమ పరిసరాలను శుభ్రపరచుకోవాలని, కార్యక్రమంలో భాగస్వాములు కావాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈఈ మహావీర్, డీపీఆర్‌వో విష్ణువర్ధన్, తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎంపీడీఓ రమాకాంత్, పంచాయతీ సెక్రటరీ అభయ్‌కుమార్, ఎంపీఈవో వినోద్, ఎంపీపీ రాజేశ్వర్, తదితరులున్నారు.


మాట్లాడుతున్న ఆత్రం సుగుణ

చట్టసభలో గళం విప్పేందుకు అవకావమివ్వాలి

• గిరిజన మహిళా సంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆత్రంసుగుణ

తలమడుగు, ఫిబ్రవరి9: చట్టసభల్లో గలం విప్పేందుకు మొదటి సారిగా జిల్లా నుంచి మహిళగా వెళ్తున్నానని, తనకు జిల్లా ప్రజలు అన్నివిధాలా సహకరించాలని గిరిజన మహిళాసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ కోరారు. శుక్రవారం మండలంలోని సుం కిడి తలమడుగు తదితర గ్రామాల ప్రజలతో ఆమె మాట్లాడారు. స్వతంత్రం వచ్చి 75 ఏళ్లవుతున్న ఆదిలాబాద్ అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. ఆదిలాబాద్ జిల్లా నుంచి తొలిసారి మహిళగా చట్టసభలో గళం విప్పేందుకు వెళ్తున్నానని, తనకు జిల్లా నుంచి అన్నివర్గాల నుంచి మద్దతివ్వాలని కోరారు. అనంతరం తలమడుగు జడ్పీటీసీ గోకగణేష్‌రెడ్డి, ఎంపీపీ కళ్యాణలక్ష్మి రాజేశ్వర్, మండల ఎంపీటీసీలు సర్పంచ్‌లు కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలతో కలిసి తనకు మద్ధతు ఇవ్వాలని ఆమెకోరారు. ఈమెవెంట గిరిజన నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: ఎమ్మెల్యే

ఆదిలాబాద్‌అర్బన్, ఫిబ్రవరి9: ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నేరవేర్చాలని ఎమ్మెల్యే పాయలశంకర్ కోరారు. శుక్రవారం అసెంబ్లిలో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నింటిని నేరవేర్చాలన్నారు. ఫసల్ భీమా నిధులను గత ప్రభుత్వం దారి మళ్లించివాడుకుని రైతులకు తీరని అన్యాయంచేసిందన్నారు. కనీసం ఈ ప్రభుత్వమైనా రైతు భీమాతో పాటు ఫసల్ బీమాను రైతులకు అందించాలని కోరారు.

రైతు కుటుంబానికి రైతుబీమా చేయూత

ఉట్నూర్, ఫిబ్రవరి9: రైతు కుటుంబానికి రైతుబీమా చేయూతనిస్తుందని ఉట్నూర్ వ్యవసాయ విస్తరణ అధికారి కుడిమెత సుధాకర్ అన్నారు. మండలంలోని ఘన్పూర్ పరిధిలోని చప్రాలకు చెందిన రైతు ఆత్రంరాజు మృతి చెందడంతో ఆయన కుటుంబానికి రూ.5లక్షల బీమా అందేలా డాక్యుమెంట్లను ఏఈఓ సుధాకర్ శుక్రవారం ఆయన సేకరించారు. రైతు కుటుంబానికి 5లక్షల ప్రయోజనం కలిగేలా ఆన్‌లైన్ నమోదు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట కుమ్ర వినాయక్‌రావు ఉన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి: తహసీల్దార్

తాంసి, ఫిబ్రవరి9: గ్రామాల్లో పారిశుధ్యం పనులను వేగవంతం చేసి ఆ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని పొన్నారి గ్రామంలో చేపడుతున్న పారిశుధ్యం పనులను అమె పరిశీలించారు. ఇళ్ల మధ్య, గ్రామంలో పెంటకుప్పలు, చెత్తాచెదారం లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

ఉట్నూర్, ఫిబ్రవరి9: మండలంలోని శ్యాంపూర్ గ్రామంలోగల ప్రధాన రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో శ్యాంపూర్‌కు చెందిన గేడం గణపతి (56) మృతిచెందాడు. ఈ ఘటన గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. గణపతి గ్రామంలోని పలుషాపుల్లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని షాంపూర్ మాజీ సర్పంచ్ గుండాల మల్లికాశంకర్ కోరారు. మృతుడికి భార్య సీతాబాయి, కొడుకు ఇద్దరు బిడ్డలున్నారు. భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు ఉట్నూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.